క్లుప్తంగా

నేడు కంచికచర్లలో పీజీఆర్ఎస్

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన పోట్లపల్లి నాగిరెడ్డి, మల్లేశ్వరి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.22,500, వజ్రకిరీటం తయారీకి రూ.22,500 ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. గుంటూరు కొత్తపేటకు చెందిన చిరుమామిళ్ల రవికుమార్, శ్రీలక్ష్మీ దంపతులు అన్నదానానికి రూ.10,116 అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

మురుగుకాల్వలను శుభ్రం చేయించండి సారూ..



కంచికచర్ల: కంచికచర్లలో డ్రైనేజీలన్నీ మురుగు కూపాలుగా మారాయి. మురుగునీటి కాల్వలో పూడికతీత చేపట్టకపోతుండటంతో మురుగు ముందుకు సాగక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ముఖ్యంగా స్థానిక వసంతకాలనీ, ఇందిరా కాలనీ, ప్రణీతకాలనీ, మోడల్కాలనీ, అంబేద్కర్ నగర్, అరుంధతీనగర్, హనుమాన్పేట తదితర కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు అధ్వానంగా ఉండటంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఆయా ప్రాంతాలన్నీ దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. పంచాయతీ అధికారులు ప్రజల నుంచి ఇంటి పన్నులు, కుళాయి పనుల వసూలు విషయంలో చూపేశ్రద్ధను మురుగునీటి కాల్వలను శుభ్రం చేసే విషయంలో కూడా చూపించాలని ఆయా కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

జానపద కళలను పరిరక్షించుకోవాలి

విజయవాడ కల్చరల్: జానపద కళలను పరిరక్షించుకోవాలని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. దామోదర జానపదం, దేశికా ఆర్ట్స్, మామ్ ట్రస్ట్, లోక కళాపరిషత్ ఆధ్వర్యాన అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జానపదం, ఆట-పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ జానపద గీతాలు తెలుగు వారి ఆత్మ అని అభివర్ణించారు. జనుల హృదయాన్ని కదిలించేది జానపదమని తెలిపారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ జానపదం జనపదం అని అభివర్ణించారు. గాయకులు పలు జానపద గీతాలను ఆలపించారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తా, సుశీల్ కుమార్, భారతి, రమణ, ఎస్. కృష్ణవేణి, రెడ్డి ప్రసాద్, బండి ఉషారాణి, పి.వెంకటరమణ, వైష్ణవి, అత్తలూరి విజయలక్ష్మి తదితరులకు కృష్ణవేణి జానపద సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, బొండా జగన్మోహనరావు, మాసాబత్తుల శ్రీనివాస్, మహంతి వాసుదేవరావు, లింగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్జున్ చక్రవర్తి అందరినీ ఆకట్టుకుంటుంది

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఈ నెల 29న విడుదల కానున్న అర్జున్ చక్రవర్తి సినిమా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆ చిత్ర హీరో విజయరామరాజు అన్నారు. ఆరేళ్లపాటు శ్రమించి ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశామని, ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. చిత్ర ప్రమోషన్లో భాగంగా ఆదివారం నగరంలోని ఓ హోటల్లో సినిమా యూనిట్ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయరామరాజు మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదనీ నా 9 ఏళ్ల కల అన్నారు. ఎంతో కష్టపడి, టీమ్ వర్క్గా ఈ సినిమాని పూర్తి చేశామని నిర్మాత, మాపై పూర్తి విశ్వాసం ఉంచి, స్వేచ్ఛ ఇచ్చారన్నారు. ఈ చిత్రం తన కెరీర్కి టర్నింగ్ పాయింట్ అవుతుందని నమ్ముతున్నట్లు తెలిపారు. మైనస్ డిగ్రీ వాతావరణంలో షర్టు లేకుండా నటించానని , ప్రేక్షకులు తమ చిత్రాన్ని వీక్షించి ఆదరిస్తే కష్టానికి తగిన ఫలితం దక్కుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐపీఎల్లో కబడ్డీ ఆడే క్రీడాకారులను ఈ చిత్రంలో తీసుకొని వారితో కబడ్డీ ఆడే సన్నివేశాలను తీశామని చెప్పారు. ఈ సమావేశంలో హీరోయిన్ సీజ రోజ్, నిర్మాత శ్రీని, నటుడు యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలంటూ ఆటోడ్రైవర్ల ఆందోళన



కొణకంచి క్రాస్రోడ్స్ వద్ద ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

కొణకంచిక్రాస్రోడ్స్(పెనుగంచిప్రోలు): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని ఆటోవర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని కొణకంచి క్రాస్రోడ్స్ వద్ద ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటోడ్రైవర్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అధికారంలోకి వస్తే ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద బ్యాడ్జి కలిగిన ప్రతి ఒక్కరికి ఏటా రూ.15 వేలు ఇస్తామన్న హామీని ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం అమలుచేయక పోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు యండమూరి వెంకటేశ్వర్లు, నారసాని వెంకటనారాయణ, నరసింహారావు, షేక్ ఇస్మాయిల్, బండి రామకృష్ణ, నువ్వుల లక్ష్మీనారాయణ, మద్దికట్ల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి..



ఆటోడ్రైవర్లకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. ఆటో డ్రైవర్లకు ఏ టా రూ.15వేలు ఇస్తా మన్న హామీ నిలబెట్టుకోవాలి. ఆటో డ్రైవర్ల జీవనోపాధికి ప్రభుత్వం చేయూత నివ్వాలి.

నారాయణ, ఆటోయూనియన్ నాయకులు

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి..



పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, ఆటోల రిపేర్లతో ఆదాయం తగ్గుతోంది. స్త్రీశక్తి పథకం కారణంగా ఆటోల్లో ఎక్కే మహిళల సంఖ్య తగ్గింది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి.

పూర్ణ, ఆటోడ్రైవర్

పింఛన్ల రద్దుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



పింఛన్లను రద్దు చేశారంటూ ఎమ్మెల్యే తాతయ్య వద్ద ఆవేదన వ్యక్తంచేస్తున్న బాధితులు

జగ్గయ్యపేటఅర్బన్:జగ్గయ్యపేట నియోజకవర్గంలో అర్హత ఉన్న ఏ ఒక్క దివ్యాంగునికి పెన్షన్ రద్దు కాకుండా చూస్తానని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) హామ ఇచ్చారు. తమ పింఛన్లు రద్దు అయ్యాయంటూ పలువురు దివ్యాంగులు ఆదివారం ఎమ్మెల్యే తాతయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. పింఛన్ను పునరుద్ధరింపజేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ అధికారులు చేపట్టిన రీ వెరిఫికేషన్లో జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన కొంతమంది అర్హుల పెన్షన్లు పొరపాటున రద్దు అయిన విషయం తనదృష్టికి వచ్చిందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇప్పటికే రద్దయిన పింఛన్లకు సంబంధించిన నోటీసులు వెనక్కు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. పింఛన్ తొలగింపునకు గురైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు స్థానిక ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ వద్ద వెంటనే దరఖాస్తు చేసుకుంటే తిరిగి పింఛన్ మంజూరవుతుందని పేర్కొన్నారు.

ప్రశంసాపత్రం అందజేత



బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చింతలూరు సత్యనారాయణ, విద్యాశాఖ అధికారి పీవీజీ రామారావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు:పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన నంచర్ల తనుశ్రీని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆదివారం అభినందించారు. విజయవాడలోని విశ్వకర్మభవన్లో నిర్వహించిన జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశంలో తనూశ్రీకి ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విశ్వ


ప్రమాదకరస్థితిలో ఓవర్హెడ్ ట్యాంకు

- శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో గ్రామస్తులు



బయటపడిన ఇనుప చువ్వలు

వీరులపాడు(జయంతి): మండలంలోని జయంతి గ్రామంలో ఉన్న రక్షిత నీటి పథకం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గ్రామంలో సుమారు ఆరు వేల మంది నివసిస్తుండగా, గ్రామస్తులకు మంచినీటి సరఫరా చేసేందుకు 1992లో పంచాయతీ కార్యాలయం వద్ద ఓవర్ హెడ్ట్యాంక్ నిర్మించారు. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ ఓవర్హెడ్ ట్యాంకు శ్లాబు పెచ్చులు ఊడిపోయి, ఇనుపచువ్వలు బయటపడ్డాయి. అయితే సంబంధిత అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. ప్రస్తుతం ఈ ఓవర్హెడ్ ట్యాంకు ద్వారానే మంచినీరు సరఫరా చేస్తున్నప్పటికీ ఈ ఓవర్హెడ్ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ తొలగించాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ కూలితే అందుకు బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నూతన ఓవర్హెడ్ ట్యాంకును నిర్మించి, ప్రమాదకరస్థితిలో ఉన్న ఓవర్హెడ్ ట్యాంకును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి ఓవర్ హెడ్ ట్యాంక్ తొలగించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



జయంతిలో శిథిలావస్థకు చేరిన ఓవర్హెడ్ ట్యాంక్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నందిగామలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

నందిగామటౌన్: స్వచ్ఛందసంస్థలు నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. సమత క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని చందమామపేట జర్మనీ హాస్టల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యులు 250మందికి వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా సౌమ్య మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో కంచికచర్ల ఎంఈవో గురునాథం, కోట రవీంద్ర, క్లబ్ సభ్యులు కెజెడ్ఎస్ కుమార్, దేవకుమార్, సుందర్, కిశోర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ఆధ్వర్యంలో..

నందిగామరూరల్:గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాలెంపాటి ప్రసాద్ తెలిపారు. మండలంలోని పెద్దవరంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేఎంఆర్, మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వైద్యశిబిరంలో 200మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. క్లబ్ ప్రతినిధులు చెరుకుమల్లి శ్రీనివాసరావు, మందరపు సీతారామయ్య, చల్లా గాంధీ, రాయల నరసింహారావు పాల్గొన్నారు.

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు(నందిగామరూరల్):చందర్లపాడు మండలం తుర్లపాడులో పబ్బతి పొంగళ్ల పుల్లయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దకాకాని శంకర కంటి ఆస్పత్రి, సత్యసాయి సేవా సమితి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 47మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి వారిని పెదకాకాని కంటిఆస్పత్రికి తరలించినట్లు పబ్బతి నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జయమ్మ, వైద్యుడు పొల్లా నరసింహారావు, గ్రామనాయకులు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైద్యబృందం

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక పెద్దరామాలయం వద్ద జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రెండురోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో మొత్తం 785 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించిన 47మందికి త్వరలోనే ఆపరేషన్లు చేయిస్తామని వివరించారు. 31వ వార్డు శాంతినగర్లో సోమవారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి, శిబిరం కోఆర్డినేటర్ మైనేని రాధాకృష్ణ, ఏఎన్ఎంలు, ఆర్పీలు పాల్గొన్నారు.

మార్కెట్లో నకిలీ పురుగుమందుల హవా

- అధిక మార్జిన్ల కక్కుర్తితో అంటగడుతున్న డీలర్లు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



పురుగు మందులు

వత్సవాయి: నకిలీ పురుగుమందుల కారణంగా రైతులు తమ పంటలను కోల్పోవడంతోపాటు ఆర్థికంగా కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికి అందివస్తున్న పంటను చీడపీడల బారి నుంచి ఎలాగైనా కాపాడుకోవాలనే రైతన్న ఆశను పలువురు పురుగుమందుల విక్రయ దుకాణదారులు సొమ్ముచేసుకుంటుండమే ఇందుకు నిదర్శనం. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రోజుకో కొత్తరకం తెగులును ఎదుర్కొంటున్న రైతన్న వాటి నుంచి పంటను రక్షించుకునేందుకు ప్రధానంగా పురుగు మందులపైనే ఆధారపడుతున్నారు. ఒక్కో రైతు ఎకరానికి పెట్టే పెట్టుబడిలో సగం పురుగు మందులకే ఖర్చు చేస్తున్నారు. పురుగు మందుల అమ్మకాలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో కంపెనీల యాజమాన్యాలు, వాటిని విక్రయించే వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మందు ఒకటే అయినా ధర మాత్రం ఒకేలా ఉండదు. అంతా డీలర్ల ఇష్టం. దీంతో మార్కెట్లో నకిలీ మందులు రాజ్యమేలుతున్నాయి.

బయో అమ్మకాలదే పైచేయి...

జగ్గయ్యపేట ప్రాంతంలో పత్తి, మిరప, వరి, మొక్కజొన్నతోపాటు కూరగాయలు పంటలు విస్తారంగా సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో పురుగుమందులకు ఇక్కడ గిరాకీ బాగానే ఉంది. ఇది అదునుగా చేసుకున్న వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. మార్కెట్లో ప్రధాన కంపెనీ మందుల కంటే నకిలీ మందులే రాజ్యమేలుతున్నాయి. వత్సవాయి మండలంలో సుమారు 26 వరకు పురుగుమందులు విక్రయించే షాపులు ఉన్నాయి. పలువురు పురుగుమందుల విక్రయ దుకాణదారులు ఈ ఏడాది కొత్త కంపెనీలకు చెందిన పురుగుమందులు వచ్చాయంటూ రైతులను నమ్మిస్తూ ఊరుపేరూ లేని పురుగు మందులను రైతులకు అంటగడుతున్నారు.

అధిక మార్జిన్లకు ఆశపడి..

ఆయా పురుగుమందులు విక్రయించే దుకాణాల వద్ద వాటి స్టాకు వివరాలు తెలిపే బోర్డులు, మందుల ధరలను సూచించే పట్టికను కూడా ఏర్పాటు చేయడం లేదు.కొన్ని నకిలబయో కంపెనీలు బినామీ పేర్లతో పురుగుమందులను మార్కెట్లోకి తెస్తుండగా, వీటిలో మార్జిన్ ఎక్కువగా ఉండడంతో అధికశాతం మంది డీలర్లు కూడా వీటినే విక్రయించేందుకు మొగ్గుచూపుతుండటం గమనార్హం. రైతులు ఆయా బ్రాండెడ్ మందులు అడిగితే వాటికంటే ఇదే మంచి మందు.. పురుగులు తొందరగా చనిపోతున్నాయని చెబుతూ రైతులకు అంటగడుతున్నారు. కొంతమంది వ్యాపారులు రసీదులో కనీసం ఆయా పురుగుమందుల బ్యాచ్ నంబర్లు రాయడం లేదు. అధికారులు తనిఖీల సమయంలో ఇలాంటి పురుగుమందులను దుకాణాల్లో లేకుండా తరలిస్తూ గుట్టుగా వ్యవహారాన్ని నడిపిస్తుండటం గమనార్హం.

తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం...

మండలంలోని పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు చేసి అనుమతులు లేని, నాసిరకం పురుగు మందులు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. రైతులు కూడా విధిగా రసీదులు తీసుకోవాలి. ఆయా పురుగుమందుల కొనుగోలు సమయంలో నిర్ణీత ధర కంటే అధికంగా వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేసినవారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం.

– జి.సత్యనారాయణ, ఏవో, వత్సవాయి

ఘనంగా వెంకయ్యస్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కొబ్బరితోటలో ఆదివారం శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భగవాన్ వెంకయ్యస్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వెంకయ్యస్వామి పారాయణం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మధ్యాహ్నం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, పీవీఆర్ స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



శీఘ్రదర్శనం చేసుకుంటున్న భక్తులు



తీర్థప్రసాదాలు తీసుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా, ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం కన్నులపండువగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

బుడమేరు కన్నీటి కష్టాలకు ‘సంవత్సరీకం’



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు నివారణకు ఏడాది కాలంలో కేటాయించిన నిధులు, చేపట్టిన పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. గతేడాది ఆగస్టు 31, సెప్టెంబర్ ఒకటో తేదీన బుడమేరు వరదలతో విజయవాడ నగరంలోని లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని, నరకయాతన అనుభవించారని గుర్తు చేశారు. నాడు ముందస్తు హెచ్చరికలు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని చెప్పారు. దాదాపు 50 మంది మరణించారని, రూ.వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. విజయవాడ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ప్రజల జీవితాలు అతలాకుతలం అయ్యాయని పేర్కొన్నారు. ఆ దెబ్బ నుంచి ప్రజలు నేటికీ పూర్తిగా కోలుకోలేదన్నారు. వరదల సమయంలో హడావిడి చేసిన సీఎం చంద్రబాబు బుడమేరు ముంపు ప్రమాదం నుంచి ప్రజలను కాపాడే చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఏడాది కాలంలో రూ.30 కోట్ల ఖర్చుతో ఒకచోట గండి పూడ్చి, గోడ నిర్మించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. నష్టపోయిన బాధితులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, కార్మికులకు పరిహారం చెల్లింపులోనూ ప్రభుత్వం వెనుకబడిందన్నారు. తక్షణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఈనెల 30న నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఉత్సవాల నిర్వహణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభ, మతసామరస్యం వెల్లివిరిసేలా నిర్వహించాలని గణపతి నవరాత్రి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథ్ రాజు తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో మండప నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపాల విషయంలో వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. సింగిల్ విండో ద్వారా అనుమతులకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. మండపాల్లో అసభ్య పాటలు, రాజకీయ అంశాలు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. సింగిల్ విండో విధానంలో సమస్యలు వస్తే సమితి పరిష్కరిస్తుందన్నారు. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యదర్శి దుర్గాప్రసాద్ రాజు, త్రిమూర్తి రాజు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం పరిశీలన తర్వాత ఎన్ఓసీ జారీ చేస్తుందన్నారు. ఉత్సవాలకు సంబంధించిన భక్తి గీతాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బిట్ర వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాసా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆనందంగా లేకపోవడమే జబ్బులకు కారణం



ప్రవచన కర్త రఘును సన్మానిస్తున్న సమభావ మిత్రమండలి సభ్యులు

పటమట(విజయవాడతూర్పు):శరీరాన్ని కష్టపెడితేనే ఆరోగ్యంగా ఉంటామని, శరీరం విశ్వం, పంచభూతాత్మకం వీటిలో ఏది దగ్గినా అనారోగ్యానికి కారణమవుతుందని, తృప్తి, ఆనందం మనిషి ఆరోగ్యానికి ప్రధాన సూత్రాలని ప్రవచన కర్త రఘు అన్నారు. ఆదివారం పటమట వాసవ్య మహిళా మండలిలో సమభావన మిత్రమండలి 107వ సమావేశం జరిగింది. కోనేరు నరేంద్ర బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మన ఆదేశంలో 23 ధ్యాన విశేషాలు ఉన్నాయని, గతాన్ని వదిలేయటం, వర్తమానంలో ఉండటమే ధ్యానమని చెప్పారు. చేతి ఐదువేళ్లు పంచభూతాలకు ప్రతీకలని, కర్మల నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు. పోసే పెట్రోలును బట్టి బండి నడుస్తుందని, అలాగే తినే తిండిని బట్టి దేశం నడుస్తుందన్నారు. ఎంవీరావు, టి. శోభనాద్రి, వై. రంగారావు, గుమ్మా సాంబశివరావు, సీహెచ్ వెంకటరెడ్డి, వై. శివాజీ, బి. వెంకటరావు, సుంకర నాగభూషణం, ఎం. అంజయ్య పాల్గొన్నారు.